నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 23 జూన్ 2024 | HYDERABAD

వీధికుక్కలు దాడి చేస్తుండగా.. తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న బాధితురాలు రాజేశ్వరి(సీసీ ఫుటేజీ)

మేడ్చల్ నగల దుకాణం దోపిడీ యత్నం కేసు వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

ప్రాణాలు పోతే గానీ.. స్పందించరా?

నగరవాసులను వణికిస్తున్న వీధి కుక్కలు

తాజాగా ఓ మహిళ పై విరుచుకుపడిన 15 శునకాలు

వైరల్‌గా మారిన సీసీ దృశ్యాలు

అధికార యంత్రాంగంపై నెటిజన్ల ఆగ్రహం

మణికొండ, జూన్ 22 : నగరవాసులను వీధి కుక్కలు వణికిస్తున్నాయి. దొరికిన వారిని దొరికినట్లు కరిచి వేస్తున్నాయి. చిన్నా,పెద్దా అనే తేడాలేకుండా.. అందరినీ హడలెత్తిస్తున్నాయి. తాజాగా ఓ మహిళపై ఏకంగా 15 శునకాలు దాడికి దిగాయి. వాటి నుంచి ఆ మహిళ అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. చిత్రపురికాలనీ ఎంఐజీ బ్లాక్-6లో నివాసముంటున్న తెలుగు సినిమా స్టంట్ మాస్టర్ బద్రీ సతీమణి రాజేశ్వరి ఉదయం కాలనీలో వాకింగ్ కోసమని ఇంటి నుంచి బయలుదేరారు. ఒంటరిగా వెళ్తున్న ఆమెపై దాదాపు 15 కుక్కలు వెంబడించి.. కరిచేందుకు ప్రయత్నించాయి. పరిస్థితిని గమనించిన రాజేశ్వరి.. దాదాపు అరగంట పాటు కుక్కలను తరిమేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నించారు. ఇంతలో ఓ ద్విచక్రవాహనదారుడు, కారు రావడంతో కుక్కలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. కాగా, వీధి కుక్కలు వెంటపడి..కరిచేందుకు యత్నించిన దృశ్యాలు..సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆ దృశ్యాలను..రాజేశ్వరి భర్త బద్రీ.. సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇంత దారుణంగా చిత్రపురికాలనీలో కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయని, అనేక సార్లు స్థానిక మున్సిపాలిటీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోలేదని ఆయన వాపోయారు. అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రశ్నించారు. 'నా భార్య అరగంటపాటు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని.. ప్రతిఘటించడంతో వీధి కుక్కల బారి నుంచి ప్రాణాలతో బయటపడిందం'టూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి ప్రాణాలైన పోయిన తర్వాతే అధికార యంత్రాంగం స్పందిస్తుందేమోనంటూ మండిపడ్డారు. కాగా, కుక్కల దాడి దృశ్యాలు వైరల్‌గా మారడంతో నెటిజన్లు సైతం తీవ్రస్థాయిలో స్పందించారు. చిత్రపురికాలనీలో జరిగిన ఘటన చూస్తే భయాందోళన కలుగుతున్నదని, ఇదే పరిస్థితి చిన్నారులకు ఎదురైతే ప్రాణాలు పోయేవన్నారు. మణికొండ మున్సిపాలిటీలో అధికార యంత్రాంగం పనిచేస్తోందా? అని ప్రశ్నించారు.

రియల్ డీలా

ఆరునెలలుగా నిలిచిన భూ వినియోగ మార్పిడి అనుమతులు

కొత్త వెంచర్లు లేక రియల్టర్ల నిరుత్సాహం.. పొంచి ఉన్న 'అమరావతి' ముప్పు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర మంటే రియల్ సందడి. గల్లీ మొదలు కార్పొరేట్ కార్యాలయాల వరకు రియల్టర్లు.. మార్కెటింగ్ ఏజెంట్లతో పాటు సాధారణ యువకుడు సైతం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక ఉపాధి మార్గంగా మలుచుకున్నాడు. కానీ గత కొన్ని నెలలుగా మహా నగరంలో 'రియల్' కళ తప్పింది. ముఖ్యంగా నిత్యం హడావుడిగా ఉండే శివారు ప్రాంతాల్లో ఆ సందడే కనిపించడం లేదు. ఇందుకు అనేక సామాజిక కారణాలు ఉన్నప్పటికీ... ప్రభుత్వపరంగా ఆశించిన సహకారం లేకపోవడం రియల్టర్లను ఆవేదన గురి చేస్తున్నది. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి వినిపిస్తున్న ప్రధాన కారణం... కొత్త వెంచర్లకు అవకాశం లేకపోవడం. సాధారణంగా నివాసయోగ్య (రెసిడెన్షియల్) జోన్‌లో ఉన్న భూముల్లో వెంచర్లకు అనుమతులు వచ్చే అవకాశం ఉన్నా.. నగర చుట్టూ అనేక ప్రాంతాల్లో ఇతర జోన్లలోని భూములను నివాసయోగ్య భూముల జాబితాలోకి మార్చేందుకు కావాల్సిన 'భూ వినియోగ మార్పిడి (ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్)' అనుమతులు నిలిచిపోవడంతో రియల్ ఎస్టేట్ రంగాన్ని నీరుగార్చుతున్నదని పలువురు రియల్ వ్యాపారులు వాపోతున్నారు.

కీలకంగా రియల్ ఎస్టేట్..

విశ్వ నగరంగా మారుతున్న హైదరాబాద్ తెలంగాణకు మాత్రమే కాదు.. దేశానికి సైతం ఒక ఆర్థిక ఇంజిన్. అంతర్జాతీయ మౌలిక వసతులు ఉన్న ఈ మహా నగరంలో విద్య, వ్యాపార, పారిశ్రామిక, ఐటీ వంటి రంగాలే కాదు.. రియల్ ఎస్టేట్ రంగం అనేది చాలా కీలకంగా మారింది. ఏటా లక్షల కోట్ల లావాదేవీలు జరిగే ఈ రంగంలో అదేరీతిలో ఉపాధి అవకాశాలు కూడా భారీగానే ఉన్నాయి. అందుకే తెలంగాణ ఏర్పడిన తర్వాత వచ్చిన మౌలిక వసతులతో దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కత్తా, చెన్నై వంటి మహా నగరాలను సైతం వెనక్కి నెట్టింది. ఆఫీస్ స్పేస్‌లోనైతే హైదరాబాద్ దేశంలోనే రారాజుగా నిలిచింది. అలాంటి మహా నగరంలో ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం కళ తప్పింది. లక్షల చదరపు అడుగుల్లో అపార్టుమెంట్లు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నా.. గతంలోని దూకుడు కనిపించక బిల్డర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో శివారు ప్రాంతాల్లోనైనా కొత్త కొత్త వెంచర్ల ద్వారా కొంత ఊపు వచ్చే అవకాశమున్నా.. పలు కారణాలు కొత్త ప్రాజెక్టులకు మోకాలడ్డుతున్నాయి. ఇప్పటికే నగరానికి వంద కిలోమీటర్ల పరిధిలోని భూములు అత్యధికం దాదాపు వెంచర్లుగా మారాయి. ఇందులో సింహభాగం గతంలో జరిగినవి కాగా.. నివాసయోగ్య జోన్‌లో ఉన్న వాటిని హెచ్ఎండీఏ అనుమతులతో వెంచర్లుగా మారుస్తున్నారు. కానీ నివాసేతర జోన్‌లోని భూముల్లో వెంచర్లు చేయడం ఇప్పుడు వ్యాపారులకు ఒక సవాల్‌గా మారింది.

ఆరు నెలలుగా..

సాధారణంగా గతంలో హెచ్ఎండీఏ రూపొందించిన మాస్టర్‌ప్లాన్-2031 ప్రకారం భూమిని పన్నెండు రకాల జోన్లుగా విభజించారు. నివాసం, వ్యవసాయం, వినోదం, పారిశ్రామికం, అటవీ... ఇలా పన్నెండు జోన్లలోని సబ్ జోన్లు కలుపుకొని సుమారు 21-24 రకాలుగా విభజన జరిగింది. ఇందులో నివాసయోగ్య జాబితాలో ఉన్న భూముల్లో మాత్రమే వెంచర్లకు అవకాశం ఉంటుంది. మిగిలిన జోన్లలోని భూములను నివాసయోగ్యంలోకి మార్చుకొని (భూ వినియోగ మార్పిడి) ఆ తర్వాత వెంచర్లు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయో కన్జర్వేషన్ మినహా దాదాపుగా మిగిలిన జోన్లలోని భూములను నివాసయోగ్యంలోకి మార్చుకునే వీలుంది. ఇందుకోసం సదరు యజమానులు భూ వినియోగ మార్పిడి కింద దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు నిబంధనల ప్రకారం వాటిని పరిశీలించి.. నిర్దేశిత రుసుముతో ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే అనంతరం ప్రభుత్వం పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తుంది. అయితే నగరం చుట్టూ నివాసయోగ్య భూములు కాకుండా ఇతర జోన్లలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. వాటిని వెంచర్లుగా చేసేందుకు అవకాశం ఉన్నా... గత ఆరునెలలుగా భూ వినియోగ మార్పిడి అనుమతులు లేకపోవడంతో కొత్త ప్రాజెక్టులకు అంకురార్పణ జరగడం లేదు.

పెండింగ్‌లో దరఖాస్తులు..

గతంలోని దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అటు కొత్త వెంచర్లు రాకపోవడం ఒకవంతైతే... ప్రభుత్వ ఖజానాకు కూడా వందలాది కోట్ల ఆదాయం నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా భూ వినియోగ మార్పిడి ప్రక్రియకు అనుమతులు ఇవ్వాలని చాలామంది రియల్టర్లు కోరుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో అమరావతి రాజధాని అభివృద్ధి అనేది కూడా హైదరాబాద్ రియల్ రంగంపై ప్రభావం చూపే అవకాశమున్నదని పలువురు రియల్టర్లు స్పష్టం చేస్తున్నారు. అనుమతులు వచ్చిన తర్వాత ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు కనీసం ఆరునెలల సమయం పడుతుందని, ఈ క్రమంలో ఇక్కడ కొత్త వెంచర్లకు అవకాశం లేనందున రియల్టర్లు అటు వైపు చూసే అవకాశమూ లేకపోలేదని ఒక రియల్టర్ అభిప్రాయపడ్డారు. వ్యాపారులకు టర్నోవర్ అనేది ప్రధానమని, అందుకే నెలల తరబడి ఖాళీగా ఉండటం కంటే అవకాశం ఉన్నచోటకు వెళ్లడం శ్రేయస్కరమనే కోణంలో ఆలోచించక తప్పదని వ్యాఖ్యానించారు.

24 గంటల్లోనే.. ఛేదించారు

మేడ్చల్ నగల దుకాణం దోపిడీకి యత్నం

ఇద్దరు నిందితుల అరెస్టు

సిటీబ్యూరో: మేడ్చల్ నగల దుకాణం దోపిడీ కేసును సైబరాబాద్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కమిషనర్ అవినాశ్ మహంతి, మేడ్చల్ డీసీసీ కోటిరెడ్డితో కలిసి వివరాలను వెల్లడించారు. ఈనెల 20న మేడ్చల్ పీఎస్ పక్కనే ఉన్న జగదాంబ జ్యువెల్లరీ దుకాణం లోకి చొరబడిన దుండగులు.. యజమానిపై కత్తితో దాడిచేసి, దోపిడీకి యత్నించి, పారిపోయారు. నిందితులను పట్టుకునేందుకు 16 పోలీసులు బృందాలు గాలింపు మొదలుపెట్టాయి. సీసీ ఫుటేజీతో నిందితులు వాడిన బైక్ నంబర్ ఆధారంగా వాహన యజమాని హబ్సిగూడకు చెందినట్లు గుర్తించారు. బైక్ యజమానిని విచారించగా తన బైక్ నాలుగురోజుల కిందట ఓయూ ఠాణా పరిధిలో నుంచి చోరీకి గురైనట్లు వెల్లడించాడు. ముంబైకి చెందిన నజీమ్ అజీజ్ కొటాడియాకు వ్యాపారంలో పెద్ద ఎత్తున నష్టాలు వచ్చాయి. కుటుంబ పోషణ కోసం ర్యాపిడో నడపడం మొదలు పెట్టాడు. వచ్చే ఆదాయం సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తనతో పాటు రాపిడో నడిపిన మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి చాదర్‌ఘాట్‌లోని నగల దుకాణంలోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. జైలులో షేక్ సోహెల్(23)తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక ఇద్దరు కలిసి నగల దుకాణాల్లో దోపిడీకి పాల్పడాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం నజీమ్, సోహెల్ బైక్‌పై వచ్చి..మేడ్చల్‌లో నగల దుకాణంలో దోపిడీకి యత్నించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

ప్రజలు రాళ్ల దాడి చేయడంతో పరుగులుపెడుతున్న పోలీసులు

తిరగబడ్డ జనం

ఇండ్ల స్థలాల కోసం.. హెచ్ఎండీఏ భూముల ఆక్రమణకు యత్నం

తరలివచ్చిన వేలాది మంది

అడ్డుకున్న పోలీసులపై రాళ్ల దాడి..ఉద్రిక్తత

స్థలంపై సుప్రీం కోర్టులో స్టే ఉంది

-హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ శివారెడ్డి

సిటీబ్యూరో/మియాపూర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. పేద ప్రజలు హెచ్ఎండీఏ భూములను ఆక్రమించేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. మియాపూర్‌లో హెచ్ఎండీఏకు ప్రభుత్వ కేటాయించిన సర్వే నంబర్ 100,101లలో సుమారు 450 ఎకరాల దాకా స్థలం ఉన్నది. దాన్ని ఎప్పటి నుంచో కబ్జా చేయాలని చాలా మంది ప్రయత్నిస్తున్నా.. హెచ్ఎండీఏ అడ్డుకుంటోంది. ఈ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తున్నారంటూ ప్రచారం జరగటంతో నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. శుక్రవారం నుంచే వేలాది మంది హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల్లోకి వచ్చి తమకు స్థలాలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. భూములను ఆక్రమిస్తున్నారని ఆలస్యంగా తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారులు.. స్థానిక పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని వదిలేసి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పినా.. వినకుండా అక్కడే ప్రజలు కూర్చిండిపోయారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేసినా..కదలలేదు. పైగా రాళ్లతో దాడి చేయడంతో పోలీసులు తప్పించుకునేందుకు పరుగులు పెట్టారు. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసు బలగాలు అక్కడి నుంచి ప్రజలను పంపించేందుకు ప్రయత్నం చేసినా, వారి నుంచి ఎదురు దాడి ఎదురైంది.

మియాపూర్‌లోని సర్వే నంబర్ 100,101లలో హెచ్ఎండీఏకు సుమారు 450 ఎకరాల దాకా భూమి ఉన్నది. ఇందులో గతంలో ఇంటర్‌సిటీ బస్ టర్మినల్ కోసం 100 ఎకరాలను కేటాయించి, ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. ప్రస్తుతం రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములపై సుప్రీం కోర్టులో స్టే ఉండడంతో అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. ఎవరైనా ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కూల్చివేయిస్తున్నాం. రెండు రోజులుగా పేద ప్రజలు స్థలాలు ఇవ్వాలంటూ హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న స్థలంలో వేల సంఖ్యలో వచ్చారు. వారందరికీ ఆ భూమికి సంబంధించిన వివరాలను తెలియజేశాం. పట్టాలు గానీ, ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని చెప్పాం. అయినా వారు అక్కడి నుంచి వెళ్లడం లేదు. హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్‌పీ, సీఐతో పాటు ప్రత్యేక పోలీసు సిబ్బంది స్థలంలోనే ఉండి వారు గుడిసెలు వేసి ఆక్రమించుకోకుండా అడ్డుకుంటున్నాం.

చట్ట విరుద్ధంగా ఆక్రమించడం సరికాదు: డీసీపీ వినీత్

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయి. హెచ్ఎండీఏ స్థలంలోకి వచ్చిన వారికి పోలీసులు ఎంతో ప్రశాంతంగా స్థలాన్ని విడిచివెళ్లిపోవాలని చెప్పారు. అది విని కొందరు వెళ్లిపోయారు. అయినా ఇంకా చాలా మంది స్థలంలో ఉండి మాకు స్థలాలు కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు.



ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ..హెచ్ఎండీఏ భూముల వద్ద గుమిగూడిన పేద ప్రజలు



అంతరాయం.. నిత్యకృత్యం

విద్యుత్ నెట్‌వర్క్ నిర్వహణలో నిర్లక్ష్యం

సిటీబ్యూరో: అధికారికంగా ఎలాంటి కరెంటు కోతలు లేకపోయినా.. సబ్ స్టేషన్లలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఉన్నా... క్షేత్ర స్థాయిలో సరఫరాలో అంతరాయాలు నిత్యకృత్యంగా మారాయి. సబ్ స్టేషన్ల నుంచి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్)ల వరకు వెళ్లే 11 కేవీ విద్యుత్ లైన్లు, అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇండ్లకు వెళ్తున్న ఎల్‌టీ లైన్లలో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు.

11 కేవీ ఫీడర్ల పరిధిలో..

సెక్షన్ల వారీగా ఆపరేషన్స్ విభాగం అధికారులు విద్యుత్ లైన్ల నిర్వహణ విషయంలో ప్రణాళికాబద్ధంగా తనిఖీలు చేసి లైన్లు దెబ్బతినే అవకాశం ఉన్న చోట వాటిని మార్చాల్సి ఉన్నా, అటు వైపే ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. కేవలం విద్యుత్ లైన్లు తెగినప్పుడు, చెట్లు, వాటి కొమ్మలు మీద పడినప్పుడు, ఇతర కారణాలతో లైన్లు దెబ్బతిని సరఫరా నిలిచిపోతేనే సిబ్బంది స్పందించి మరమ్మతులు చేస్తున్నారు.

సమగ్ర సర్వేకు సీఎండీ ఆదేశం..

క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్లలో తలెత్తున్న సమస్యలను గుర్తించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. వచ్చే సోమవారం నుంచి ప్రతి విద్యుత్ స్తంభం నుంచి వెళ్లే విద్యుత్ లైన్ల పరిస్థితి ఎలా ఉంది..? ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్సులు, ఇతర కేబుళ్లు ఎలా ఉన్నాయన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ఇదంతా మొక్కుబడిగా కాకుండా 9 సర్కిళ్ల పరిధిలో ఉండే ప్రతి స్తంభం వద్దకు వెళ్లి పూర్తి వివరాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజినీర్ నుంచి మొదలుకొని ఆర్టిజన్ వరకు తిరిగి విద్యుత్ వినియోగదారులను కలుసుకొని సమస్యలను తెలుసుకునే ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించనున్నారు.

నేరస్తులపై ఉక్కుపాదం

సిటీలో డెకాయి ఆపరేషన్

స్వయంగా రంగంలోకి దిగిన సీపీ...

ఆసిఫ్‌నగర్‌లో గాల్లోకి సీపీ కాల్పులు...?

ధ్రువీకరించని అధికారులు

చిలకలగూడ ఠాణా పరిధిలోనూ గాల్లోకి పోలీసుల కాల్పులు

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): నడిరోడ్లపై హత్యలు, దోపిడీ దొంగతనాలతో అట్టుడికిపోతున్న నగరంలో శాంతిభద్రతలను గాడిలో పెట్టి, దోపిడీ దొంగల ముఠాలను పట్టుకునేందుకు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని పలుచోట్ల డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా చిలకలగూడలో దుండగులు పోలీసులపైకి దాడులకు యత్నించడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. ఇదిలా ఉండగా పాతబస్తీలోని ఆసిఫ్‌నగర్, కుల్సుంపురా డివిజన్‌లలో రెండు మూడు రోజులుగా జరుగుతున్న హత్యలు, ఇతర నేరాల నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆయా ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు జరిపారు. అదే సమయంలో ఆసిఫ్‌నగర్‌లో రోడ్లపై కొందరు వ్యక్తులు పెద్ద ఎత్తున గుమ్మిగూడటంతో నెలకొన్న అలజడితో స్వయంగా రంగంలోకి దిగిన సీపీ గాల్లోకి కాల్పులు జరిపినట్లు పుకార్లు షికారు చేస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు, సీపీని వివరణ కోరేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా వారు స్పందించలేదు.

పోలీసుల అదుపులో ఏడుగురు స్నాచర్లు

చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో సెల్‌ఫోన్ స్నాచింగ్, ఇతర దోపిడీ దొంగల ముఠాలను పట్టుకునేందుకు యాంటీ డెకాయి బృందాలు శుక్రవారం అర్ధరాత్రి డెకాయి ఆపరేషన్ నిర్వహించాయి. మఫ్టీలో ఉన్న పోలీసుల వద్ద నుంచి దుండగులు సెల్‌ఫోన్‌ను లాక్కునేందుకు యత్నించడంతో సదరు నిందితుడిని పట్టుకున్నారు. మిగిలిన దుండగులు ముకుమ్మడిగా పోలీసులపై దాడులకు యత్నించడంతో గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఏడుగురు స్నాచర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా నగరంలో విరుచుకుపడుతున్న థార్, భవర్య గ్యాంగ్‌లను పట్టుకోవడమే లక్ష్యంగా పోలీసులు డెకాయి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎనిమిది గ్యాంగ్‌లను అరెస్టు చేశాం

ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్

నేరాలను నియంత్రించేందుకు నగరంలో డెకాయి ఆపరేషన్ నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు ఎనిమిది గ్యాంగ్‌లను అరెస్టు చేశాం. ఈ క్రమంలోనే చిలకలగూడ పరిధిలోని మెట్టుగూడలో డెకాయి ఆపరేషన్ నిర్వహించాం. అక్కడ కొందరు యువకులు ఒక ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ల స్నాచింగ్, దొంగతనాలు వంటి నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే అక్కడ డెకాయి ఆపరేషన్ జరిపి నలుగురు ముఠా సభ్యులను పట్టుకుని విచారిస్తున్నాం. మెట్టుగూడలో డెకాయి ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో దుండగులు పోలీసులపై దాడికి యత్నించారు. వారిని నియంత్రించడానికి పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది.

గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజును మందలిస్తున్న నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

గస్తీ చెయ్యమంటే.. ఏం చేస్తున్నావ్?

గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్‌ను మందలించిన సీపీ

'శాంతిభద్రతల పరిరక్షణ కోసం గస్తీ చెయ్యమంటే పోలీస్‌స్టేషన్‌లో ఏం చేస్తున్నావ్' అంటూ నగర పోలీస్ కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్ రెడ్డి గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజును మందలించారు. నగరంలో వరుసగా హత్యలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజును చూసి.. ఏరియాలో గస్తీ చేయాలని చెబితే.. పీఎస్‌లో ఏం చేస్తున్నావంటూ.. ప్రశ్నించారు. వెంటనే ఏరియాలో గస్తీకి వెళ్లమని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

-మెహిదీపట్నం, జూన్ 22

చంపుతానని బెదిరిస్తుండటంతో..

మెహిదీపట్నం జూన్ 22: రౌడీషీటర్ హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మెహిదీపట్నం లోని దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, బాలస్వామిలతో కలిసి వివరాలు వెల్లడించారు.

మల్లేపల్లి ఆగాపురాలో నివసించే షేక్ అలీ అలియాస్ అలీం (34) పూల అలంకరణ వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడిపై హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉంది. షాహేద్(29), పాషా(32), షేక్ ఫెరోజ్ పాషా(30), సయ్యద్ గౌస్(32) అలీంకు స్నేహితులు. స్నేహితుల వద్ద డబ్బులు దోచుకొని అలీం మద్యం తాగేవాడు. పైగా 'మీ అంతు చూస్తానం'టూ.. బెదిరించేవాడు. అతడి వేధింపులతో విసిగిపోయిన స్నేహితులు.. ఫీల్‌ఖానా రోడ్‌లో ఉన్న వైన్స్ వద్ద అలీంను పిలిచి కత్తులతో పొడిచి చంపేశారు. పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు.